
# మృత్యువులో దాగిన సత్యం




ఊరు ఊరంతా నల్లపిల్లి పేరు చెబితేనే జడుసుకుంటున్నారు. నల్లపిల్లి భయానికి కొందరు రాత్రింబగళ్ళు ఇళ్ళు విడిచి బయటకి వెళ్లడం లేదు. కొందరు యువకులు గ్రూపులు గ్రూపులుగా ఏర్పడి కత్తులు, కటార్లు పట్టుకొని రాత్రిళ్లు గస్తీ తిరుగుతున్నారు. అయినా ప్రతి రాత్రి నల్లపిల్లి ఎవరో ఒకరి మీద దాడి చేస్తూనే ఉంది. ఆ దాడిలో ఇప్పటికే ఇద్దరి ప్రాణాలుపోయాయి. చచ్చిన వాళ్ల దాడి ఎలా జరిగిందో చెప్పలేకపోయారు. పోస్టుమార్టం రిపోర్టులో మాత్రం ఎవరో అమానుషంగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చడం వల్ల చనిపో యారని తేల్చారు. సాధారణంగా మనుషులెవరూ ఆగర్భ శత్రువైనా సరే అలా చేస్తారనుకోవడానికి వీల్లేదు కనుక ఇది ఖచ్చితంగా ఏదో క్రూరమృగం పనై వుం టుందని అభిప్రాయపడ్డారు. చచ్చినవాళ్ళ సంగతిలా ఉండగా నల్లపిల్లి వాతపడి గాయపడి బతికి బయటపడ్డ వాళ్ళెవరూ భయంతో నల్లపిల్లి తమమీద ఎలా దాడి చేసిందీ తాము ఎలా బయటపడిందీ చెప్పడం లేదు.

నల్లపిల్లిని ఖచ్చితంగా చూసిన వాళ్ళెవరూ లేరు. ఒకరిద్దరు చూశామని చెబుతున్నవాళ్ళు దాని పోలికలు ఇదమిద్దంగా ఇవీ అని చెప్పలేకపోతు న్నారు. టార్చిలైట్ కాంతిలో అది మాకేసి ఎర్రగా చూసిందని ఒకరంటే కాదు దాని కళ్ళు పచ్చగా ఉన్నాయని ఇంకొకరు అంటున్నారు. దాని ఒంటిమీద తెల్లమచ్చలు కానీ గోధుమరంగు మచ్చలు కానీ ఏమైనా ఉన్నాయా అంటే అంతా ఏక కంఠంతో దాని ఒంటిమీద ఎలాంటి మచ్చలూ లేవని మాత్రం చెబుతున్నారు. అలాంటప్పుడు చీకట్లో నల్లపిల్లిని పోల్చుకోవడం ఎలా సాధ్యం అవుతుంది? సాధ్యం కాదు. అందుచేత పగలైనా సరే కనిపించిన నల్లపిల్లి మీద దాడి చేసి దాన్ని చితగ్గొట్టేసి చంపుతున్నారు.

ఎన్ని పిల్లుల్ని చంపినా ఆ నల్లపిల్లి మనుషుల మీద దాడిని మానడం లేదు. దాన్నించి కాపాడుకోవడానికి ఇళ్లల్లోంచి బయ టకి వెళ్లకుండా ఉండటానికి కూడా వీల్లేకుండా ఉంది. కొందరు రాత్రిళ్లు డ్యూటీలకి వెళ్లక తప్పదు. రాత్రిళ్లు రైళ్లల్లో, బస్సుల్లో రాక తప్పదు. బస్‌స్టాండ్ నుంచి, రైల్వే స్టేషన్ల నుంచీ వాళ్లని రిక్షావాళ్లు, ఆటోలవాళ్లు ఊళ్లోకి తీసుకురాక తప్పదు. అలాంటప్పుడు తప్పనిసరిగా రాత్రిళ్లు బయటకు వెళుతున్న వాళ్లలో ఎవరో ఒకరు ఏదో ఒకలా ఆ పిల్లి వాతన పడుతున్నారు.

పిల్లులు కనిపిస్తే చాలు అవి తెల్లవైనా, న ల్లవైనా కనిపించిన పిల్లిని కనిపించినట్లుగా కాల్చి పడెయ్యండ ని యస్‌పిగారు పిల్లు ల మీద షూట్ ఎట్‌సైట్ ఆర్డరి చ్చారు. అప్పుడు ఎలకలు రెచ్చి పోయి భద్రంగా దాచుకొనే తిండిగింజల్ని, కరెన్సీ





నోట్లనీ, పె ళ్లాం పిల్లల్ని కొరుక్కు తినేస్తా యేమోనని కొంద రు పోలీస్ ఆఫీసర్లు సందేహం వెలిబుచ్చినప్పటికీ యస్.పి. గారు పట్టించుకోలేదు. ఎలకలు చిన్న చిన్న పిక్‌పాకెట్స్ లాంటివి. పిల్లులు డెకా యెట్స్, మర్డరర్స్ లాంటి పెద్ద క్రిమినల్స్. అందుచేత ముందుగా పిల్లుల్ని చంపి మేజర్ క్రైంస్ నివారించడం మంచిదని చెప్పారు. అప్పట్నించీ పోలీసులు కూడా పిల్లుల వెంట పడ్డారు. అయినా ఆ నల్లపిల్లి మాత్రం మనుషుల్ని తప్పించుకొని తిరుగుతూ సందుల్లోంచి, గొం దుల్లోంచీ మనుషుల మీద దాడి చేస్తూనే వుంది.

## నందిగం కృష్ణారావు

అది మామూలు నల్ల పిల్లి కాదు. ఆ ఊళ్లో ఒక మాంత్రికుడు బెంగాల్ వెళ్లి చాలా సంవ త్సరాలు అక్కడ ఉండి మంత్ర తంత్రాలు నేర్చుకొచ్చాడు. తిరిగొచ్చిన తరువాత తను నేర్చిన

విద్యల గురించి భార్యకి చెప్పాడు. "నిజమా! అని ఆమె ఆశ్చర్యపోయింది. "అబద్ధం కాదు కావాలంటే చూడు నేను ఏ రూపాన్నైనా దాల్చగలను. పిల్లిగానైనా, కుక్కగానైనా, ఎలకగానైనా, ఏనుగ్గానైనా, ఒంటెగానైనా ఎలాగంటే అలాగ మారిపోగలను" అన్నాడతను. అదంతా నమ్మలేనట్లుగా చూసిందామె. "ఋజువు చేస్తానుండు. నేను ఏ రూపం దాల్చాలో చెప్పు" అన్నా డతను.

కుక్కైతే మీద బడి కరిచేస్తాడేమోనని భయపడింది. ఏనుగైనా, ఒంటైనా అయితే అతనికి ఇల్లు పట్టదనుకొంది. అందుచేత ఎలకగానైనా, పిల్లిగానైనా మారిపొమ్మంది.



ఎలకగా మారితే ఏ పిల్లైనా వెంటబడితే తనకు దిక్కుండదు అనుకొన్నాడతను. అందుచేత పిల్లిగా మారాలని నిశ్చయించుకొన్నాడతను. ఆ తరువాత ఒక గ్లాసుడు నీళ్లని మంత్రించి, తిరిగి ఆమె చేతికిచ్చాడు.

"ఈ విషయం బాగా గుర్తుంచుకో! నాలో నేను కొన్ని మంత్రాలు పఠిస్తాను. ఆ తరువాత కొంచెంసేపటికి నువ్వు చూస్తుండగానే నల్ల పిల్లిగా మారిపోతాను. అప్పుడు నువ్వు మంత్రించిన జలాన్ని నా మీద చల్లు. అలాచేస్తే తిరిగి నేను మామూలైపోతాను. అలా గనుక నువ్వు చెయ్యకపోతే మృత్యువే నాకు మోక్షమవుతుంద"ని చెప్పాడు.

అలాగేనని తలూపిందామె. ఆ తరువాత ఆమె చూస్తుండగానే ఆ మాంత్రికుడు తనలో తనే ఏదో గొణుక్కొన్నాడు. గబుక్కున నల్లపిల్లిగా మారిపోయాడు.

భయంతో అరిచిందామె. చేతిలోని నీళ్ల గ్లాసు జారిపోయి కిందపడి బద్దలైంది. ఆ తరువాత ఆమె కూడా స్పృహతప్పి పడిపోయింది. ఆమె అరుపుకి చుట్టుపక్కల వాళ్ళంతా పోగయ్యారు.

పిల్లి అక్కడ్నించి పారిపోయింది. అలా పారిపోయిన నల్లపిల్లే తన భార్యమీద ఉన్న కక్ష ఇలా అందరి మీదా తీర్చుకొంటోందని ఆ ఊళ్ళో వాళ్ళ నమ్మకం.

కుక్క కాటుకి చెప్పుదెబ్బ అన్నారు. పాము కాటుకు మంత్రంతో సరి అన్నారు. పిల్లి కాటుకు దాన్ని చంపడమే మార్గం అని నిశ్చయించుకొన్నారు.

పిల్లిని చంపడం మహా పాపం అని వేదాలు ఘోషిస్తున్నాయని బ్రాహ్మలు చెప్పారు.

బ్రాహ్మల మాటని అంతా పెడచెవిన పెట్టారు. పైగా పిల్లి రూపంలో ఉన్న మనిషిని చంపితే తప్పు లేదని వాదించారు.

ఏం చెయ్యాలో బోధపడక పండితులు నోరు మూసుకొని ఊరుకొన్నారు. అమాయకపు పిల్లుల్ని చంపినప్పుడు, తమని పిలిచి శాంతి చేయించు కోమని మాత్రం సలహా ఇచ్చారు. కలిగినవాళ్లు పిల్లుల్ని చంపినప్పుడల్లా బ్రాహ్మల్తో శాంతి చేయించు కొంటున్నారు. అలా పిల్లుల మీద కొచ్చి పడిన పిడుగు బ్రాహ్మల మేలుకొచ్చినట్లైంది.

అలాంటి ఒకరోజు ఉదయాన్నే నడిరోడ్డు మీద ఇన్స్పెక్టర్ పిడుగు చచ్చిపడిఉన్నాడు.

> **లాఠీ ఎత్తిన చేతిని అలాగే పట్టుకొని వెనక్కి విరిచాడా కుర్రవాడు. ఆయువుపట్టు ఆ కుర్రాడి చేతిలో చిక్కినట్లు గిలగిలా కొట్టుకొన్నాడు ఇన్స్పెక్టర్. "డ్యూటీలో వున్న పోలీస్ ఆఫీసర్ని డ్యూటీ చెయ్యనివ్వకుండా అడ్డుకోవడం, చేయి చేసుకోవడం నేరం. ఇందుకు నిన్ను బొక్కలో తోయించగలను" కన్నీళ్ళ పర్యంతమై హెచ్చరించాడు.**

అతని మొహం అంతా రక్కేసినట్లుగా ఉంది. ఒంటినిండా గాయాల్తో, చూడ్డానికతను మనిషి కాదు గాయం అన్నట్లుగా ఉన్నాడు.

రాత్రెప్పుడో అతన్ని పిల్లి కర్చేసి, రక్కేసి, చంపేసిందనుకొన్నారంతా.

అతని అసలు పేరు పిడుక్కాదు. సత్యనారాయణ. అయితే అతని తల్లిదండ్రులు పెట్టిన ఆ పేరు ఇష్టంలేక, పిడుగని మార్చుకొన్నాడు. పిడుగు ఏ ఇంటి మీదైనా పడితే ఆ ఇల్లు కాలిపోతుంది. ఏ మనిషి మీదైనా పడితే ఆ మనిషి మసైపోతాడు. ఎవరి బతుకులోకైనా అడుగుపెడితే ఆ బతుకు బుగ్గైపోతుంది. అందుచేత నేను పిడుగునిరా. నా చేతికి చిక్కితే నువ్వు కర్చైపోతావు" అని అతను తన చేతికి చిక్కిన వాళ్లని బెదిరించేవాడు. నిజానికతని ఆకారమే భీకరంగా ఉంటుంది. ఆరున్నర అడుగుల ఎత్తు, మూడడుగుల వెడల్పు, వెడల్పు మొహం, బోర ముక్కు, పెద్ద కళ్లు, బానపొట్టతో అతన్ని చూసిన వాళ్లెవరికైనా, నాలుగు కాళ్లతో నడవాల్సిన వింత మృగం నిటారుగా నిల్చున్నాడేమోననిపిస్తుంది. అందుచేత అతనేమీ అనకపోయినా అతన్ని చూసి అంతా జడుసుకుంటారు. ఇహ అతను నోరిప్పితే అతని చేతికి చిక్కిన వాళ్లని అమ్మా అబ్బనేకాక అటు ఏడు తరాల్నీ, ఇటు ఏడు తరాల్నీ కూడా తిట్టిపోస్తాడు.

అప్పటికెవరైనా అవమానం తట్టుకొని సూసైడ్ చేసుకోకుండా ఉంటే, వాళ్లని లాకప్‌లో పెట్టి కుళ్లబొడిచేసి చంపెయ్యగలడు. లేదా కేసుల్లో ఇరికించేసి బతికున్నంత కాలం కోర్టుల చుట్టూ తిప్పగలడు.

అతను అప్పుడప్పుడు కోర్టుకు కేసులు కడుతున్నందువల్ల అతనూ బొత్తిగా లా అబెడింగ్ సిటిజన్ కాదని కోర్టు నిర్ధారించలేకపోయింది. అందుచేత అతను బొర్ర విరుచుకొని ఫుల్ పవర్స్‌లో చాలాకాలం పవర్‌ఫుల్‌గా బతికేడు.

అయితే కాలుకు ముల్లు గుచ్చుకొన్నట్లుగా ఒక సంఘటన అతన్ని చాలాకాలం బాధపెట్టింది. అతను ఒకరోజు డ్యూటీమీద మండీ మార్చులంతో వెళుతుంటే అతని పవర్‌కి కొంతమంది స్టూడెంట్స్ అడ్డొచ్చేరు. దార్లో రోడ్డు మీద ఎవరో భార్యాభర్తలు పోట్లాడుకొంటున్నారు. ఆ పోట్లాటని దారినపోయే వాళ్లంతా తిలకిస్తుండటంతో రోడ్డు మీద ట్రాఫిక్ జామైపోయింది. వాళ్ళిద్దరి మధ్యన తగాదా ఎందుకొచ్చిందో ఎవరికీ తెలవదు. కానైతే వాళ్ళు ఒకర్నొకరు మాత్రం ఛండాలంగా బూతులు తిట్టుకొంటున్నారు. "నన్ను తిడతావా" అని మొగుడు పెళ్లాన్ని కొట్టడానికి వెంటబడుతుంటే "ఏది కొడతావా? కొట్టు చూస్తాను. నన్నుకానీ కొట్టావంటే ఒరేయి నువ్వు నాకేకాదు మరే ఆడదానికి పనికి రాకుండా చేస్తాను" అని బస్తీమే సవాల్ అన్నట్లుగా ఎదురు తిరిగి నిలిచిందా ఆడది.

పెళ్లాన్ని కొట్టడానికి ఆమె మీదకి పులిలా దూకుతున్న మొగుడు, ఎవరో తనని ఆపేసినట్లు ఆగిపోయి "నన్ను ఒదిలెయ్యండి! ఇవాళ అదో నేనో తేలిపోవాలి" అని ఉన్న

చోట నుంచి కదలకుండా అదే పనిగా ఊగుతున్నాడు.

చూడ్డానికి పైకి వాళ్లంతో డాబుగా, దర్జాగా ఉన్నారు. అయితే ఉతకడానికేసిన దొరల బట్టలు కట్టుకొన్న వాళ్లంతా చాలా చౌక బారుగా తిట్టేసుకొంటున్నారు.

ఈ గలాటా చూసి ఇన్‌స్పెక్టర్ పిడుగు చుట్టూ వున్న జనాన్ని లాఠీతో బాదుతూ వాళ్ళ మధ్య కెళ్ళాడు. మొగుడి జుట్టు బలంగా పట్టుకొని పైకెత్తి మొహం పగిలిపోయేలా వాడి మొహం మీద బలంగా గుద్దేడు. దెబ్బకి ఆ మొగుడి మూతిపళ్లు కదిలిపోయాయి. అది చూసి అతని భార్య మహంకాళిలా వచ్చి "ఎవడ్రా! నువ్వు' అంటూ ఇన్‌స్పెక్టర్ కడుపులో ఒక తన్ను తన్నింది. ఆ దెబ్బతో పిడుగు 'అమ్మా' అంటూ కూలిపోయాడు.

పోలీసులంతా ఆ ఆడమనిషి మీద పడి ఇష్టమొచ్చినట్లుగా కొట్టడం మొదలుపెట్టారు. ఆమె మొగుడు పోలీసుల కాళ్లా-వేళ్లా పడి బతిమాలాడు. పోలీస్ గుండెలు కరగలేదు.

ఇంతలో పిడుగు లేచి, ఆ ఆడమనిషిని, ఆమె మొగుణ్ణి పిడిగుద్దులు గుద్దాడు. ఆదెబ్బలకి వాళ్లు కాబట్టి తట్టుకొన్నారు కానీ, అదే నువ్వో, నేనో అయితే చచ్చి ఊరుకొనేవాళ్ళం. పిడుగు వాళ్ళని కొట్టి ఊరుకోలేదు. కక్షతో ఆ ఆడమనిషి చీర ఒలిచేసి, లో దుస్తులు కూడా విప్పేసి, దాన్ని రోడ్డుమీద పరేడ్ చేయించమని కానిస్టేబుల్స్‌ని ఆదేశించాడు.

ఇదంతా చూస్తున్న వాళ్లల్లోంచి కొందరు స్టూడెంట్స్ పోలీసులకి అడ్డు తగిలారు. ఆమె గుడ్డలామెకి ఇచ్చెయ్యండన్నారు.

"ఆడది కనిపిస్తే చాలు ప్రతివాడు హీరో అయిపోతాడు. మీరెవరు బే మమ్మల్ని ఆపడానికి" అని లాఠీ పైకెత్తాడు ఇన్‌స్పెక్టర్ పిడుగు.

లాఠీ ఎత్తిన చేతిని అలాగే పట్టుకొని వెనక్కి విరిచాడొక కుర్రవాడు. ఆయువుపట్టు ఆ కుర్రాడి చేతిలో చిక్కినట్లు గిలగిలా కొట్టుకొన్నాడు ఇన్‌స్పెక్టర్. "డ్యూటీలో వున్న పోలీస్ ఆఫీసర్ని డ్యూటీ చెయ్యనివ్వకుండా అడ్డుకోవడం, చేయి చేసుకోవడం నేరం. ఇందుకు నిన్ను బొక్కలో తోయించగలను" కన్నీళ్ళ పర్యంతమై హెచ్చరించాడు.

అతని హెచ్చరికని ఆ కుర్రాడు పట్టించుకోలేదు.

"ముందు ఆ మనిషిని ఒదిలెయ్యండని మీ వాళ్లకు చెప్పు" స్థిరంగా అన్నాడు.


ఒదిలెయ్యండన్నట్లుగా సైగ చేశాడు ఇన్‌స్పెక్టర్. అలాగతను మొదటిసారి అతని డ్యూటీలో ఓడిపోయాడు. అవమానంతో వుండిపోకుండా చేతిలో పవర్ ఉంది కనుక పగతో రగిలిపోయాడు. అలా రగిలి రగిలి ఒకరోజు రాత్రి ఆ స్టూడెంట్‌ని పట్టుకొని రెండో కంటికి తెలీకుండా బుగ్గి చేశాడు. మిగిలిన వాళ్లని కేసుల్లో ఇరికించి వాళ్ల భవిష్యత్తు కూలదోశాడు. ఈ విషయంలో ఊళ్లో పెద్ద గొడవ జరిగింది. ఫలితంగా అధికార్లు అతన్ని సస్పెండ్ చేశారు. ఆ తరువాత మూడేళ్లవరకు అతను ఆ ఊళ్లో ఎవరికీ కనబడలేదు. అతన్ని గురించి అంతా మర్చిపోయారు. ఈ మధ్యనే అతను డియస్‌పిగా తిరిగి ఆ ఊళ్లో దిగబడ్డాడు. అలాంటివాడ్ని చంపేశారంటే అంతా ఆశ్చర్యపోయారు. అతన్ని నల్లపిల్లే చంపేసి ఉంటుందని కొందరు అనుకొన్నారు. ఏదేమైనా ఊరు ఊరంతా కదిలి ఆ శవాన్ని చూడటానికి వెళ్లారు.

అతను తిరిగి లేచి తమని ఎక్కడ దహిస్తాడో నన్నట్లుగా, అతని శవం చుట్టూ మూగినవాళ్లు భయంతో బితుకు బితుకుమంటూ మౌనంగా ఉండిపోయారు.

ఒక ముసలాయన అందర్నీ తోసుకుంటూ ముందుకు వచ్చాడు. శవాన్ని నిశితంగా పరిశీలించాడు. "ఇవాల్టితో నల్లపిల్లి పీడా విరగడైంది" అన్నాడు.

తాము పుట్టి బుద్దెరిగినప్పటి నుంచీ తమ వీపున ఎత్తుకొన్న బరువుని ఒక్కసారిగా ఒదిలించుకొన్నట్లైందరికీ. •

# కొడవలి ముక్కు సూర్య విహంగం



అమెరికా ఖండం హమ్మింగ్ పక్షులకు ప్రసిద్ధి. అటువంటి లక్షణాలు కలవే ఈ సూర్య విహంగాలు. మకరందం, తేనె పీల్చడంలో ఈ రెండింటి మధ్య మంచి పోలికలు ఉన్నాయి. కానీ ఆ పక్షులకి ఇవి అంత సాటి కాదు. హమ్మింగ్ పక్షులు చాలా అందమైనవి. చిన్నవి. ఎగరడంలో మంచి చాకచక్యం చూపుతాయి. సూర్య విహంగాలు 10-20 సెం.మీ. మధ్య ఉంటాయి. తేలిక పక్షులు.

వీటి ముక్కులు చాలా విలక్షణంగా కిందకి వంగి కొడవలి లాగా ఉంటాయి. నాలిక చుట్టుకొని గొట్టం మాదిరిగా ఏర్పడుతుంది. దాంతో తేనె పీల్చుకొంటాయి.

నెక్టెరినియా మూడు, నాలుగు వేల మీటర్ల ఎత్తున నివసిస్తుంది. ఈ జాతులు హిమాలయ పర్వత శ్రేణిలో కనబడతాయి. మగ సూర్య విహంగాలు చాలా అద్భుతంగా రంగులు మెరిసిపోతూ ఉంటాయి. బొమ్మలో మగపక్షి పిల్లలకి ఆహారం అందించడం గమనించవచ్చు. ఆడవి మాత్రం కాంతి విహీన వర్ణంలో ఉంటాయి. అయితే సంతానోత్పత్తి కాలంలో ఈ పరిస్థితి ఉన్నా ఇతర కాలాలలో మగవి కూడా ఈకలు రాల్చేసుకొని మామూలు రంగులతో ఆడవాటిలాగే మారిపోతాయి, ఈ అలంకరణలు అన్నీ ఇప్పుడు ఎందుకనుకుంటూ.

**వన్యప్రాణులు**

నెక్టెరినియా జాతులు నగర మధ్యలోనూ నివాసం ఏర్పరచుకొంటాయి. గుంపుల్లో సంచరిస్తాయి. మగవి తరచూ పోట్లాడుకోవడం చూపరులకు ఆనందం కలిగిస్తుంది. నగరాల్లో అందమైన తోటల్లో విహరిస్తూ పూలనుంచి తేనె మకరందం గ్రహిస్తాయి. చాలా జాతుల ఈ పక్షులు తేనెతో బాటు సాలె పురుగులు కీటకాలు భక్షిస్తాయి.

మొత్తానికి 66 జాతులు సూర్య విహంగాలు గుర్తించారు. చాలావరకు ఇవి ఆఫ్రికాలోనే కనబడతాయి. ఆసియా, ఇండియాలో కూడా ఉన్నాయి. కొద్ది జాతులు ఆస్ట్రేలియా ఉత్తర ఉష్ణ ప్రాంతాల్లో ఉంటాయి.

ఈ పక్షులు వృక్షవాసి లక్షణం కలవే అయినా సాధారణంగా అతి చురుకుగా పువ్వులకోసం అలా తిరుగుతూ ఉంటాయి. పనిలో పనిగా కీటకాలు, సాలె పురుగులు కనబడితే వదలవు. కొన్ని సందర్భాలలో పువ్వులు లోతుగా ఉంటే పువ్వు మొదట్లో చిన్న రంధ్రం చేసి తేనె పీలుస్తాయి. దానివల్ల పువ్వుకు నష్టం జరగదు.

గూళ్లు కట్టుకోడానికి కొమ్మల్లో ఒక ఆధారం ఎంచుకొంటాయి. మానవ ఆవాసాల దాపుల్లో అయితే తీగలకి వేలాడదీస్తాయి. పైన ఒక చిన్న రంధ్రం ఒక పోర్టికోలాంటిది లోపల ఏర్పరుస్తాయి. గుడ్లు, పిల్లలకు హాని కలగకుండా అంతా మెత్తగా తయారుచేస్తాయి. నార, ఎండువేళ్లు, ఎండిన ఆకులు బాగా ఉపయోగపడతాయి. సాలెగూళ్ల తాడుతో గూడు పటిష్ఠ పరచుకొంటాయి. రెండు మూడు గుడ్లు పెడతాయి.

సీజన్ రివాజుగా ఒక ప్రాంతంలో పుష్పాలు లభించనపుడు పొరుగు ప్రాంతాలకి వలస పోతాయి.

- జమ్మి కోనేటిరావు